ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





టీచర్‌గా మారిన అదనపు కలెక్టర్

సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ బుధవారం కొద్దిసేపు టీచర్‌గా మారారు. మహ్మదాపూర్ పాఠశాలను సందర్శించిన ఆమె పదో తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పారు.

- హుస్నాబాద్ రూరల్

గృహజ్యోతి వెలుగులు 9,74,857 ఇళ్లకు..



- కసరత్తు ప్రారంభించిన విద్యుత్‌శాఖ
- ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల గుర్తింపు
- ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్ నమోదు
- ప్రక్రియను పరిశీలించిన ఉన్నతాధికారులు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే గృహ వినియోగదారులు 9,74,857 మంది ఉన్నారు. అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 5,11,000 కనెక్షన్లు, సిద్దిపేట జిల్లాలో 2,92,193 కనెక్షన్లు, మెదక్ జిల్లాలో 1,71,664 కనెక్షన్లు గృహజ్యోతి పథకానికి అర్హత సాధించనున్నాయి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 7: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా 'గృహజ్యోతి' పథకం అమలుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల నుంచే ఈ పథకం వర్తింపజేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించేవారికి ఈ పథకం ద్వారా ఉచిత విద్యుత్ అమలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. ఈ పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారి సమాచారాన్ని విద్యుత్‌శాఖకు అప్పగించడంతో అర్హులను గుర్తించే పనిలో ఉన్నారు. దీంతో విద్యుత్ సిబ్బంది ప్రతీ ఇంటిని సందర్శించి దరఖాస్తుదారుల కరెంట్ కనెక్షన్ నంబర్, ఆధార్, రేషన్‌కార్డు, సెల్‌నంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సేకరించిన డేటాను విద్యుత్ పంపిణీ సంస్థల బిల్లింగ్‌డేటాతో అనుసంధానం చేసి ఈ నెల 15 వరకు అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నారు.

కిరాయిదారులకూ వర్తింపు

సొంతిల్లు లేక ఇతరుల ఇళ్లలో కిరాయికి ఉండేవారికి కూడా గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయనున్నారు. మీటర్ ఇంటి యజమాని పేరిట ఉన్నప్పటికీ కిరాయిదారుల వివరాలను అనుసంధానం చేస్తున్నారు. కిరాయిదారులు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోకపోయినా ఇంటికి విద్యుత్ సిబ్బంది వచ్చినప్పుడు పేరు, విద్యుత్ కనెక్షన్, ఫోన్ నంబర్, ఆధార్, రేషన్‌కార్డు వివరాలను నమోదు చేయించుకుంటే సదరు ఇంటి కనెక్షన్‌తో వారి వివరాలను అనుసంధానించనున్నారు. ఇంటి యజమాని అభ్యంతరం తెలిపితే మాత్రం నమోదు చేయవద్దని అధికారులు సిబ్బందికి సూచిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

టీఎస్ఎస్పీడీసీఎల్ ఎనర్జీ ఆడిట్ సీజీఎం, జిల్లా ప్రత్యేకాధికారి రంగనాథ్‌రాయ్

గజ్వేల్/సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 7: గృహజ్యోతి పథకాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ఎస్పీడీసీఎల్ ఎనర్జీ ఆడిట్ సీజీఎం, జిల్లా ప్రత్యేకాధికారి రంగనాథ్‌రాయ్ సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్, సిద్దిపేట మున్సిపాలిటీల్లోని పలు వార్డుల్లో బిల్లింగ్‌డాటాతో వినియోగదారుల ఆధార్, వివరాల అనుసంధానాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్ మీటర్‌కు ఆధార్, వివరాల అనుసంధాన కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లావ్యాప్తంగా చురుకుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిల్లింగ్ మిషన్ ద్వారా ఇంటికి వచ్చే బిల్లింగ్ సిబ్బందికి వినియోగదారుల ఇంటికి వచ్చినప్పుడు అన్ని వివరాలను తెలిపి సహకరించాలన్నారు. విద్యుత్ మీటర్ ఇంటి యాజమాని పేరుపై ఉన్నప్పటికీ ప్రస్తుతం ఇంట్లో అద్దెకున్న వారి వివరాలను సర్వేసుకు అనుసంధానం చేస్తున్నామని, దీనివలన అద్దెకు ఉన్న వారికి సైతం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట విద్యుత్ శాఖ జిల్లా అధికారి మహేశ్, గజ్వేల్ డీఈ భానుప్రకాశ్, ఏడీఈ జగదీశ్ఆర్య, ఏఈ మారుతి, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.



గజ్వేల్‌లో బిల్లింగ్ డేటా అనుసంధానం చేస్తున్న సీజీఎం రంగనాథ్‌రాయ్

ఇంటింటా వివరాల నమోదు : విద్యుత్‌శాఖ డైరెక్టర్ నందకుమార్

గృహజ్యోతి పథకంలో భాగంగా ప్రభుత్వ నిబంధనల ఆధారంగా అర్హులను తేల్చేందుకు ఇంటింటా వివరాల నమోదు ప్రకియను ప్రారంభించామని విద్యుత్‌శాఖ డైరెక్టర్ నందకుమార్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలో వినియోగదారుల వివరాల నమోదు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. అద్దెకున్న వారి వివరాలను సర్వేసుకు అనుసంధానం చేస్తున్నామన్నారు. యజమాని అనుమతితో కిరాయిదారుల వివరాలను కూడా నమోదు చేస్తారని తెలిపారు. ఈ నెల 15 వరకు ఈ ప్రక్రియను పూర్తిచేస్తామని వెల్లడించారు. ఆయన వెంట ఎస్ఈ జానకిరామ్, డీఈ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

- ఈనెల 22 వరకు దరఖాస్తులకు అవకాశం
- ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 7 : గ్రామీణ విద్యార్థుల కోసం 2013 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మండలాల వారీగా ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలతో పాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఇందులో ఆరో తరగతిలో సీటు లభిస్తే ఇంటర్ వరకు ఖర్చు లేకుండా ఇంగ్లిష్ మీడియంలో కార్పొరేట్ స్థాయిలో విద్య పొందవచ్చు.

జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలలు

జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఇర్కోడు, ఇబ్రహీంనగర్, కొండపాక, అక్కేనపల్లి, హుస్నాబాద్, నాగసముద్రాల, ముస్త్యాల, మద్దూర్, బెజ్జంకి, మిరుదొడ్డి, జగదేవ్‌పూర్, గజ్వేల్, లచ్చపేట, దౌల్తాబాద్‌లోని ఆదర్శపాఠశాలలకు పక్కా భవనాలు, బాలికలకు హాస్టల్ వసతి, సదుపాయాలు ఉన్నాయి. 6 నుంచి పదో తరగతి వరకు ప్రతి తరగతిలో 100 సీట్ల చొప్పున ఉన్నాయి. పాఠ్యాంశాలతో పాటు ఉపాధి అవకాశాల కల్పన కోసం విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. అన్ని ఆదర్శ పాఠశాలలో అధునాతనమైన ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు.

దరఖాస్తుకు 22వ తేదీ వరకు గడువు

ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆరో తరగతిలో 100 సీట్లు, 7, 8, 9 , 10వ తరగతిలోని ఖాళీ సీట్లను ఈ ప్రవేశ పరీక్ష ద్వారా మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన భర్తీ చేస్తారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫలితాల తర్వాత మెరిట్ జాబితాల ప్రకారం విద్యార్థులను ఎంపిక చేస్తారు. మే 25 నుంచి 31వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

మల్లన్న ఆలయంలో అకౌంటెంట్ జనరల్ ఆడిట్ షురూ

- ఆదాయ వనరులు, అభివృద్ధి పనుల రికార్డుల పరిశీలన
- 2018-2023 వరకు జరిపిన లావాదేవీలపై ఆరా

చేర్యాల, ఫిబ్రవరి 7 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో ప్రభుత్వ అకౌంటెంట్ జనరల్ ఆడిట్ ప్రారంభమైంది. ఈ మేరకు ఓ సీనియర్, ఇద్దరు జూనియర్ ఆడిటర్లు బుధవారం ఆలయానికి చేరుకుని రికార్డుల పరిశీలన చేపట్టారు. 2018 నుంచి 2023 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి లావాదేవీలపై ఆరా తీస్తున్నారు. ఆలయ అభివృద్ధి వనరులు, ఆయా ఆర్థిక సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల చెల్లింపుల నమోదు, ఇన్‌కమ్ ట్యాక్స్ జీఎస్టీ చెల్లింపులు, టెండర్ల నిర్వహణలో నిబంధనల పాటింపు, ఇతరత్రా అంశాలకు సంబంధించిన రికార్డుల నమోదు, ఓచర్లను పరిశీలిస్తున్నారు.నాలుగు రోజులపాటు ఆడిట్ చేపట్టనున్నారు. గుర్తించిన లోటుపాట్లపై కమిషనర్‌కు నివేదిక అందించనున్నారు.

ఆలయానికి సంబంధించిన ఐటీ, జీఎస్టీ చెల్లింపుల విషయంలో ప్రైవేటు ఆడిటర్ సక్రమంగా రిటర్న్ దాఖలు చేయకుండా సుమారు రూ.10 లక్షలు దుర్వినియోగం చేసిన విషయమై కొన్నిరోజుల క్రితం ఆలయాధికారులు పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో కేసు నమోదైన విషయం విదితమే. కాగా ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ఆడిట్‌లో ప్రభుత్వ చెల్లింపుల పారదర్శకత, రికార్డుల నమోదుపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు.

కల్పవనం కాటేజీలకు గ్రహణం!

- సంగాపూర్ అర్బన్ పార్కులో ఏళ్లుగా సాగుతున్న పనులు
- కలెక్టర్ ఆదేశించినా వీడని నిర్లక్ష్యం



గజ్వేల్ పట్టణంలోని కల్పవనం అర్బన్ పార్కు

గజ్వేల్, ఫిబ్రవరి 7 : గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్ కల్పవనం అర్బన్ పార్కు పనులు ఐదారేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. కలెక్టర్ వచ్చి పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. 117 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.3 కోట్లతో ఈ పార్కును అభివృద్ధి చేశారు. పార్కులో రాశీవనం, గెజిబోలు, మల్కబావి సుందరీకరణ, ఆటవస్తువులు, 9 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. దాదాపు 40వేల చెట్లను నాటారు. అన్ని పూర్తయినా చిన్నచిన్న పనులు మిగిలి ఉండడంతో పార్క్ అందుబాటులోకి రావడం లేదు.

మరో రూ.38 లక్షలు అయితే పూర్తి

రూ.2 కోట్ల రూర్బన్ మిషన్ నిధులతో 12 కాటేజీలను పూర్తిచేయగా, మరో రూ.38 లక్షలతో మరమ్మతులు, తుది దశ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యం, గార్డెనింగ్ పెంచాల్సి ఉంది. డైనింగ్‌హాల్, ఫర్నిచర్, చిన్నచిన్న సామగ్రి తీసుకువస్తే అటవీశాఖకు ఆదాయం సమకూరడంతో పాటు స్థానిక ప్రజలకు ప్రైవేటు రిసార్టులకు వెళ్లే బాధ తప్పుతుంది. ఇప్పటికే కాటేజీల నిర్మాణం, డైనింగ్‌హాల్, కిచెన్ నిర్మాణం పూర్తి అయింది. దాదాపుగా ఐదేళ్ల క్రితం కాటేజీల నిర్మాణం చేపట్టగా వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకునే అవకాశాలు ఉన్నది.



కల్పవనంలోని కాటేజీ

కలెక్టర్ ఆదేశించినా..

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ గతేడాది మార్చి 5, మే 22న అర్బన్ పార్కు పనులను పరిశీలించి, వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులు అందిస్తానని హామీ ఇచ్చినా పనులు పూర్తి చేయడం లేదు. ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విధంగా గార్డెన్లను పెంచాలని, పార్కులోని విశేషాలపై రాజీవ్ రహదారి పొడవునా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, వాకర్లకు వసతులు కల్పించాలని, సైక్లింగ్‌కు ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించినప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.





మండుతున్న ఎండ.. గ్రీన్‌మ్యాటే మొక్కలకు అండ

వేసవికాలం సమీపిస్తుండటంతో రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతుంది. మనుషులే కాకుండా మొక్కలు ఎండకు మాడే పరిస్థితి. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపల్లి శివారులో రంగనాయకసాగర్ ప్రాజెక్టు కట్ట సమీపంలో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా నిర్వాహకులు పందిళ్లు (గ్రీన్‌మ్యాట్‌లు) ఏర్పాటు చేసి మొక్కలకు రక్షణ కల్పిస్తున్నారు.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మాండవ్య తీరం... రామలింగేశ్వరుడి వైభవం

- నేటి నుంచి కూడవెల్లి రామలింగేశ్వరస్వామి జాతర
- మాఘ అమావాస్య పుణ్యస్నానాలకు ఏర్పాట్లు
- మల్లన్నసాగర్ నీటి విడుదలతో కూడవెల్లి వాగుకు జలకళ





రామలింగేశ్వరస్వామి ఆలయం, మూలవిరాట్

కూడలిక్షేత్ర నివాసాయా... కామికార్థ ప్రదాయినే..!
మాఘమాస్యోత్సవ ప్రియాయా.... శ్రీరామలింగాయ మంగళం..!!

దుబ్బాక, ఫిబ్రవరి 7: దుబ్బాక మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయం మాఘమావాస్య జాతర గురువారం నుంచి ప్రారంభంకానున్నది. దేవుడి ఊరేగింపుతో ఆలయ ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. కూడవెల్లి వాగు ఒడ్డున వెలిసిన 'కూడవెల్లి గుళ్లను ఈ ప్రాంతంలోని భక్తుల ఆరాధ్యదైవంగా కొలుస్తారు. ప్రతి యేటా మాఘ అమావాస్య పర్వదినం మొదలుకుని పంచమి వరకు జాతర ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. పదిహేను రోజుల ముందు నుంచే ఉత్సవ వాతావరణం నెలకొంటుంది. ఈ జాతరకు దుబ్బాక, మిరుదొడ్డి, రామాయంపేట, నిజామాబాద్ జిల్లా దోమకొండ, బిక్కనూరు, కరీంనగర్ జిల్లా కొత్తపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీర్‌రావుపేట, ముస్తాబాద్ మండలాల నుంచి భక్తులు తరలిరానున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే రైతులు రెండు రోజుల ముందు నుంచే బంధుగణంతో ఎండ్లబండ్లలో వచ్చి కూడవెల్లి వాగు ఒడ్డున విడిది ఏర్పాటు చేసుకుంటారు. కూడవెల్లి జాతరను పుష్కరించుకుని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. వాగులో స్నానాలు ఆచరించే సమయంలో ప్రమాదాలు సంభవించకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. దుబ్బాక సర్కిల్ పోలీసులు బందోబస్తును నిర్వహిస్తున్నారు.



కూడవెల్లి వాగు

మాఘస్నానం ఎంతో పవిత్రం

తూర్పు నుంచి వచ్చే పెద్దవాగు, పడమర నుంచి వచ్చే చిన్నవాగు, మధ్యవాగుతో కలిసి ప్రవహిస్తోంది. ఈ మూడు వాగుల కలయికతో మాండవ్యనదిగా ఏర్పడిన కూడవెల్లి వాగులో మాఘ అమావాస్య రోజు పుణ్యస్నానం ఆచరిస్తే పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. పవిత్రంగా ఆచరించే పుణ్యస్నానాలకు నీటి కొరత తీరింది. గతంలో వాగులో నీటి సౌకర్యం లేక ఏళ్ల తరబడి కూడవెల్లి జాతర ప్రభను కోల్పోయింది. నీటి వెతలతో భక్తులు అవస్థలు పడుతూ వచ్చారు. రెండేళ్ల క్రితం మల్లన్నసాగర్ రిజర్వాయర్‌తో అనుసంధానం చేసి నీటిని విడుదల చేస్తున్నారు. ఈసారి నీటిని విడుదల చేయడంతో కూడవెల్లి వాగు కళకళలాడుతుంది.

శిఖం భూమిలో తవ్వకాలు జరుపుతున్న వారికి జరిమానా

నారాయణరావుపేట, ఫిబ్రవరి 7: వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లక్ష్మారెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని జక్కాపూర్ రెవెన్యూ పరిధిలో అనుమతి లేకుండా ఎక్స్‌కవేటర్‌తో బావి తవ్వుతున్న వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జక్కాపూర్ శివారులోని పూలిశేరు కుంట శిఖం భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్ సహాయంతో బావి తవ్వుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పనులు నిలిపివేసినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులను విచారణ చేయగా.. ఎలాంటి అనుమతులు లేవని, ప్రభుత్వ భూమిలో బావి తవ్వినందుకు రూ.25 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు చేసినా, నిర్మాణాలు చేపట్టినా వాల్టా చట్టం ప్రకారం చర్యలు తప్పవని తహసీల్దార్ లక్ష్మారెడ్డి హెచ్చరించారు.

బావిలో దూకి యువకుడి బలవన్మరణం

● పెళ్లికావడం లేదని మనస్తాపంతో..

నంగునూరు, ఫిబ్రవరి 7: పెళ్లి కావడం లేదని మనస్తాపంతో యువకుడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నంగునూరు మండలంలోని కోనాయిపల్లికి గ్రామానికి చెందిన రజనీకర్‌రెడ్డి(38) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లి కాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం రజనీకర్‌రెడ్డి కోనాయిపల్లి గ్రామ శివారులోని నిమ్మ బాల్‌రెడ్డి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం బావిలో మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకున్నారు. కాగా విచారణ అనంతరం అదే గ్రామానికి చెందిన రజనీకర్‌రెడ్డి మృతదేహంగా గుర్తించారు. కాగా మృతదేహాన్ని బావిలోంచి తీసేందుకు గ్రామస్థులెవరూ ముందుకు రాకపోవడంతో ఎస్‌ఐ స్వయంగా బావిలోకి దిగి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ మోహన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయస్థాయికి చరణ్‌తేజ్‌గౌడ్



వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థితో పాఠశాల యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 7: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి చరణ్‌తేజ్‌గౌడ్ రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. బీహార్‌లో జరిగే జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చరణ్‌తేజ్ గౌడ్ పాల్గొననున్నాడు. వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థి జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల విద్యాసంస్థల డైరెక్టర్ సలోమోన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అరుణరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

దొంగతనాలకు చెక్

ఫలిస్తున్న కొమురవెల్లి పోలీసుల వ్యూహం

- గంగిరేగుచెట్టు ప్రాంగణంలో నిలిచిన అపహరణలు
- 20మంది పోలీసులు, సిబ్బందితో బందోబస్తు
- పటిష్ఠ నిఘాతో చోరీలు తగ్గుముఖం

చేర్యాల, ఫిబ్రవరి 7: జనసమ్మర్థం అధికంగా ఉండే కొమురవెల్లి మల్లన్న ఆలయ రాజగోపురం, గంగిరేగు చెట్టు ప్రాంగణంలో దొంగతనాలు చోటుచేసుకోకుండా కొమురవెల్లి పోలీసులు తీసుకున్న ప్రత్యేక చర్యలు ఫలిస్తున్నాయి. తద్వారా ప్రశాంతంగా మొక్కులు తీర్చుకుంటున్న పరిస్థితి నెలకొనడంతో భక్తులు దొంగల బెడద నుంచి ఊరట చెందుతున్నారు. ఆలయానికి దూరంగా వాహనాలను నిలిపివేయిస్తున్న విషయంలో పలువురి నుంచి భిన్న ఆరోపణలు ఎదుర్కుంటున్నప్పటికీ దొంగతనాల నివారణకు తీసుకున్న బందోబస్తు చర్యలను కొనియాడుతున్నారు. మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రతీ ఆది, బుధవారాలలో వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. తమ కోరికలు ఈడేర్చినందుకు ప్రతిగా భక్తులు అధికసంఖ్యలో గంగరేగుచెట్టు ప్రాంగణంలో నజరు పట్నాలు రచించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఇంటిల్లిపాది తరలివస్తుండటంతో జనసమ్మర్థం అధికంగా ఉంటుంది. పట్నాలువేసే వారితో పాటు మహిమాన్వితమైన గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టి గండదీపానికి దండం పెట్టి ప్రదక్షిణలు చేస్తున్న



గంగిరేగుచెట్టు ప్రాంగణంలో పర్యవేక్షిస్తున్న పోలీసులు



రాజగోపుర ఆవరణలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంను ఆశ్రయిస్తున్న భక్తులు

క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు గుంపులో చేరి దోచుకుంటున్నారు. పలువురు మాయలేడీలు మహిళల మెడలలో నుంచి బంగారు గొలుసులు, పర్సులు కొట్టేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో గతనెల 7వ తేదీన జరిగిన మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం రోజున తోట బావి ప్రాంగణంతో పాటు గంగిరేగు చెట్టు ఆవరణలో పలువురి మహిళలు బంగారు గొలుసులు కొట్టేసి ఉనికి చాటుకోవడంతో భక్తుల్లో అలజడి మొదలైంది.

పోలీసుల అప్రమత్తం.. పటిష్ట నిఘా

జాతర ప్రారంభంలోనే పలువురి బంగారు ఆభరణాలు అపహరణకు గురవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. భక్తుల సొమ్ము భద్రత కోసం ప్రత్యేకచర్యలు చేపట్టారు. గంగిరేగుచెట్టు ప్రాంగణం చుట్టూ పటిష్ట నిఘా కోసం సుమారు 25 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించారు. ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు రెండు షిఫ్టులలో పర్యవేక్షించడంతో పాటు సుమారు 20 మంది మహిళలు, పోలీస్ కానిస్టేబుళ్లు గస్తీ ఏర్పాటు చేశారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి ఆరాతీస్తున్నారు. అంతేకాకుండా ఆలయం లోపలికి వెళ్లే ప్రధాన మార్గమైన రాజగోపుర ఆవరణలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అక్కడ పలువురు సిబ్బంది అందుబాటులో ఉండి ఆయా పరిసరాలలో పోలీసుల నిఘా ఉన్నదని తెలిపేలా చేసిన ప్రయత్నం సత్ఫలితాన్నిస్తున్నది.

భక్తులకు భరోసా కల్పించేందుకు కృషి

మల్లన్న దర్శనం కోసం వచ్చే భక్తులకు భద్రత కల్పించి భరోసా పెంపొందింపచేసేందుకు కృషి చేస్తున్నాం. రద్దీ అధికంగా ఉండే గంగిరేగుచెట్టు ప్రాంగణంలో పటిష్ఠ నిఘాతో పర్యవేక్షిస్తున్నాం. దీంతో మూడువారాల జాతరలో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

- నాగరాజు, కొమురవెల్లి ఎస్ఐ

ఇంకా సీఎం కేసీఆరేనా!



రాష్ట్రంలో ఎన్నికలు జరిగి, ముఖ్యమంత్రిగా ఎ.రేవంత్‌రెడ్డి బాధ్యతల చేపట్టి నేటికీ సరిగ్గా రెండు నెలలు గడిచింది. అయినా ఆ విద్యాసంస్థకు మాత్రం ముఖ్యమంత్రిగా మాజీ అయిన కేసీఆర్ ఉన్నట్టున్నది. అందుకే కాబోలు పటాన్‌చెరులో తెలంగాణ మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూలు, జూనియర్ కళాశాల బోర్డుపై ముఖ్యమంత్రిగా కేసీఆర్ బొమ్మ ఉండడం విమర్శలకు తావిస్తున్నది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి

చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి



యాదయ్య(ఫైల్)

మనోహరాబాద్, ఫిబ్రవరి 7: చెరువులో చేపల వేటకు వెళ్లిన ఇద్దరు నీట మునిగి మృతిచెందారు. ఈ సంఘటన మనోహరాబాద్ మండల పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం పక్కిబండ గ్రామానికి చెందిన యాసిన్‌ఖాన్(60), బర్రి యాదయ్య(58) కలిసి గ్రామ కుడి చెరువులో చేపల పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి చనిపోయారు. చేపల వేటకు వెళ్లిన వారు ఎంతకీ రాకపోవడంతో ఆందోళన చెందిన ఇరు కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. అనంతరం చెరువు కట్టపైన చెప్పులు, బట్టలు కనిపించడంతో రాత్రి 10 గంటలకు చెరువులో వెతకగా ఇద్దరి మృతదేహాలు లభించాయి. కాగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు యాసిన్ కుమారుడు మహ్మద్ గౌస్ ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో...



లక్ష్మణ్ మృతదేహం

చేగుంట, ఫిబ్రవరి 7: చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ హరీశ్‌గౌడ్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట మండల పరిధిలోని పొలంపల్లి గ్రామానికి చెందిన యాట లక్ష్మణ్(23) మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని తుర్క చెరువులో చేపల వేటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఈ క్రమంలో చుట్టుపక్కల పొలాల రైతులకు చెరువు గట్టున ద్విచక్ర వాహనం, చెప్పులు, బట్టలు కనిపించడంతో కుటుంబసభ్యులకు సమాచారమందించారు. కుటుంబసభ్యులు, గ్రామస్థులు చెరువు వద్దకు చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో లక్ష్మణ్ మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీశ్‌గౌడ్ తెలిపారు.

టీవీవీపీలో 317 జీవో కింద 60 మంది స్టాఫ్‌నర్సుల బదిలీ

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 7: సంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) పరిధిలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న 60 మంది స్టాఫ్ నర్సులు 317 జీవో అమలుతో సొంత జోన్లకు బదిలీ అయ్యారు. జోన్-5కు పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి నుంచి ఒకరు, సంగారెడ్డి జీజీహెచ్ నుంచి ఒకరు బదిలీ అయ్యారు. 3 జోన్‌కు పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి నుంచి ముగ్గురు, జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి నుంచి ఇద్దరు, సంగారెడ్డి జీజీహెచ్ నుంచి 30 మంది, నారాయణఖేడ్ ఏరియా ఆస్పతి నుంచి ఇద్దరు, జోగిపేట ఏరియా ఆస్పత్రి నుంచి ఇద్దరు, సదాశివపేట సీహెచ్‌సీ నుంచి ఒకరు బదిలీఅయ్యారు. 7 జోన్‌కు పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి నుంచి ఆరుగురు, సంగారెడ్డి జీజీహెచ్ నుంచి 12 మంది బదిలీ అయ్యారు. బదిలీ అయిన స్థానాల్లో కొత్తవారు నియమితులయ్యే వరకు తిరిగి పాత స్థానంలోనే పనిచేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. రెండేళ్ల కిందటే అన్ని ప్రభుత్వ శాఖల్లో జీవో 317 అమలులో భాగంగా ఉద్యోగులు సొంత జోన్లకు బదిలీ అయినా వివిధకారణాల నేపథ్యంలో టీవీవీపీ కింద పనిచేసే వారికి స్థానచలనం కలగలేదు. ఎట్టకేలకు 317 జీవో అమలుతో టీవీవీపీ కింద పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులకు తొలుత స్థానచలనం కలుగగా, మున్ముందు మిగతా ఉద్యోగులు, వైద్య సిబ్బంది సొంత జోన్లకు బదిలీ అయ్యే అవకాశం ఉన్నదని టీవీవీపీ అధికారవర్గాలు తెలిపాయి.

గ్రామాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించాలి

- 'పది'లో వందశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలి
- సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



హుస్నాబాద్ మండలం నాగారంలో పారిశుధ్యంపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 7: గ్రామాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు మహిళలు కంకణబద్ధులు కావాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలం నాగారం, మహ్మదాపూర్ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లోని మురుగు కాలువలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను సందర్శించారు. గ్రామాల్లో ఎక్కడా ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్స్ దర్శనం ఇవ్వకుండా వాటి వాడకాన్ని సమూలంగా తగ్గించాలన్నారు. పెళ్లిళ్లు, ఫంక్షన్లకు, జాతరకు వెళ్తున్న సమయాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వాడకుండా స్టీల్ బ్యాంకు ద్వారా స్టీల్ ప్లేట్లు, గ్లాసులు తీసుకుని ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన పెంపొందించాలన్నారు. గ్రామాల్లోని నర్సరీల పెంపకంలో అశ్రద్ధ చేయొద్దని పేర్కొన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పాలనాధికారులు దృష్టిపెట్టాలని సూచించారు. వాటర్ ట్యాంకులను పరిశుభ్రం చేయాలని వాటర్‌మెన్‌లను ఆదేశించారు. డంపింగ్‌యార్డుల ద్వారా వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేసి పంట పొలాలకు వాడుకోవాలని పేర్కొన్నారు. ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, డంపింగ్‌షెడ్ల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో బాలిక ఆరోగ్యం పట్ల పరీక్షలు చేపట్టాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థులకు పాఠాలు బోధించిన అదనపు కలెక్టర్

పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల నిర్వహణ చేపట్టాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహ్మదాపూర్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఎంతమంది 10 జీపీఏ సాధిస్తారనే నమ్మకం ఉందో చేతులు ఎత్తి చూపాలన్నారు. నిత్యం పాఠశాలకు హాజరుకావాలని, శ్రద్ధతో చదివి లక్ష్యం చేరుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీల రికార్డులను పరిశీలించి పంచాయతీ నిధుల నిల్వలు, ఉపాధి పనులపై కార్యదర్శులను ఆరాతీశారు. ఆమె వెంట ఎంపీపీ లకావత్ మానస, జిల్లా పంచాయతీ అధికారి బి.దేవకి, బీసీ వెల్ఫేర్ అధికారి సరోజన, ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డి, ఎంపీపీ సత్యనారాయణ,ఏపీఎం శ్రీనివాస్, ఎంపీటీసీ పిట్టల శ్రావణి, తాజా, మాజీ సర్పంచులు బత్తుల సుగుణ, సంపత్, కార్యదర్శులు ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 7: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ కోరారు. మునిపల్లి మండలం కంకోల్ సమీపంలోని ఎల్అండ్‌టి డెక్కన్ టోల్ ప్లాజా వద్ద జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆయన పాల్గొని ప్రసంగించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే మరణాల సంఖ్య తగ్గించవచ్చని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా వాహనదారులకు గులాబీ ఇచ్చి రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ రమేష్‌కుమార్, కొండాపూర్ సీఐ చంద్రయ్య, సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్, మునిపల్లి ఎస్ఐ సురేష్, ఎల్అండ్‌టి రాజేష్‌విచారి, సంతోష్ డోగ్రే, విజేందర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



వాహనదారులకు గులాబి పువ్వు ఇచ్చి అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రూపేష్

పారదర్శకంగా ఈవీఎంల తనిఖీ: మెదక్ కలెక్టర్



స్ట్రాంగ్‌రూం గది సీల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 7: జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం యంత్రాల మొదటిస్థాయి తనిఖీలను పారదర్శకంగా ఇంజనీర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం స్థానిక గోడన్‌లో ఎఫ్ఎల్‌సీ, వెబ్‌కాస్టింగ్, ఈవీఎంల నిర్వహణ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు(బియూ) కంట్రోలింగ్ యూనిట్(సీయూ) వీవీ ప్యాట్ల యంత్రాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హత్నూర, ఫిబ్రవరి 7: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని బోర్పట్ల గ్రామ శివారులో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన శ్రీరాములు(63) తన వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోరు మోటారు స్టార్టర్ డబ్బా వద్ద స్విచ్ ఆన్‌చేస్తున్న క్రమంలో షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమీప పొలంలో ఉన్న రైతులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసేసరికి శ్రీరాములు అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

లాభాల్లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోకు జోన్‌లో ఐదోస్థానం

- టీఎస్ఆర్టీసీ ఈడీ పురుషోత్తంనాయక్



గజ్వేల్ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తంనాయక్

గజ్వేల్, ఫిబ్రవరి 7: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపో హైదరాబాద్ జోన్ పరిధిలో ఐదోస్థానంలో నిలిచిందని హైదరాబాద్ జోన్ టీఎస్ఆర్టీసీ ఈడీ పురుషోత్తంనాయక్ తెలిపారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పరిధిలో నిర్మిస్తున్న ప్రజ్ఞాపూర్ బస్టాండ్, గజ్వేల్ బస్‌బే, ప్రారంభమైన గజ్వేల్ బస్టాండ్లను ఆయన బుధవారం తనిఖీ చేశారు. అనంతరం డిపోలో సూపర్‌వైజర్స్, సిబ్బంది పనితీరును పరిశీలించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపో నవంబరు 2023 వరకు రూ.90 లక్షల లాభాల్లో ఉన్నదని, హైదరాబాద్ జోన్‌లో ఐదోస్థానంలో నిలిచినందుకు సిబ్బంది, అధికారుల శ్రమను అభినందించారు. డిపోలో ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు పెంచేందుకు తగిన సూచనలు చేశారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ బి.సురేఖ, ఎస్‌టీఐ కనకలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున ముగ్గురిపై కేసు

- 15 గ్రాముల 4 గంజాయి ప్యాకెట్లు, రెండు మొబైల్స్, స్కూటీ స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న చేర్యాల సీఐ శ్రీను

మద్దూరు, ఫిబ్రవరి 7: దూళిమిట్ట మండల కేంద్రంలోని జగ్గన్నకుంట వద్ద గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ముగ్గురు యువకులను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి మద్దూరు పోలీసులు పట్టుకున్నట్లు చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. బుధవారం మద్దూరులోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్‌అలీతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. దూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన చిలుక ఉదయ్‌కుమార్, బోయిని భాను, బాబు(మైనర్) జల్సాలకు అలవాటు పడ్డారు. ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో హైదరాబాద్ నుంచి గంజాయి తెస్తూ విక్రయిస్తున్నారు. కాగా బుధవారం దూళిమిట్ట మండల కేంద్రంలోని జగ్గన్నకుంట వద్ద గంజాయి సేవిస్తూ.. విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా.. నమ్మదగ్గ సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. వారి నుంచి 15 గ్రాముల 4 గంజాయి ప్యాకెట్లు, సిగరెట్ పేపరు, బాటిల్ ద్వారా పీల్చే పైపు, రెండు మొబైల్స్ స్కూటీని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. డిగ్రీ చదువుతున్న ఉదయ్‌కుమార్‌పై 2022లో గంజాయి కేసు నమోదైందని తెలిపారు. భాను కూలీ పనులు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో పాటు మద్దూరు ఎస్ఐని చేర్యాల సీఐ అభినందించారు. రివార్డు కోసం పోలీస్ కమిషనర్‌కు సిఫార్స్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్‌కు యత్నం

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 7: సిద్దిపేట పట్టణంలో బాలుడిని కిడ్నాప్‌కు యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాలుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. హరిప్రియనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వంశీధర్‌రెడ్డి కుమారుడు(10) ఈ నెల 2న సాయంత్రం 6 గంటలకు అపార్ట్‌మెంట్ దగ్గరలో ఉన్న హెయిర్ కటింగ్ షాపుకు వెళ్లి కటింగ్ చేసుకుని వస్తున్నాడు. ఇంతలో ఓ గుర్తు తెలియని వ్యక్తి నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చి బాలుడితో మాట్లాడి బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు వెళ్దాం.. బండి ఎక్కు అని అడిగాడు. దీంతో బాలుడు భయపడి ఇంటికి పరిగెత్తి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వచ్చి చూడగా సదరు వ్యక్తి అప్పటికే ఉడాయించాడు. అనంతరం సీసీ కెమెరాలను పరిశీలించగా వచ్చిన వ్యక్తి సరిగ్గా కనిపించలేదు. దీంతో బాలుడి తండ్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన సిద్దిపేటలో కలకలం సృష్టించింది.

పట్టపగలు చికెన్ సెంటర్‌లో చోరీ

- సుమారు రూ.3 లక్షలు మాయం

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 7: సిద్దిపేట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కమాన్ వద్ద ఉన్న సుధాకర్‌రెడ్డి చికెన్ సెంటర్‌లో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు వెళ్లి కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.3 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. చోరీ జరిగిన కొద్దిసేపటి తర్వాత యజమాని కౌంటర్‌లో ఉన్న డబ్బులు తీయడానికి చూస్తే కనిపించలేదు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారమందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికెన్ సెంటర్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్యారం పోటీలకు ఎంపీవో సతీష్ ఎంపిక



నూతికట్టు సతీష్

మనోహరాబాద్, ఫిబ్రవరి 7: ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్యారం పోటీలకు మనోహరాబాద్ ఎంపీవో నూతికట్టు సతీష్ ఎంపికయ్యారు. ఈ పోటీలు 10 నుంచి 15 తేదీ వరకు బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో జరగనున్నాయి. ఈ సందర్భంగా సతీష్‌కు పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఢిల్లీ బృందం సభ్యులు

మర్కూక్‌లో అభివృద్ధి పనులు భేష్

● ఢిల్లీ అధికారుల బృందం కితాబు

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 7: మర్కూక్ మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు బాగున్నాయని ఢిల్లీ బృందం సభ్యులు ఈశ్వర్ సెండ్రే, లిల్లీపాల్ మెచ్చుకున్నారు. బుధవారం సెంట్రల్ సెక్రెటేరియట్‌కు చెందిన వివిధ శాఖల అధికారుల బృందం ప్రత్యేక అధికారి కౌసల్యదేవితో కలిసి మండల కేంద్రంలోని పల్లెపార్కును, వైకుంఠధామం, ప్రభుత్వ పాఠశాలలను, నర్సరీని, రైతువేదికను సందర్శించారు.రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మర్కూక్ మండలంలోని అభివృద్ధి పనులు చేపట్టారని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగేమండల కార్యాలయంలోని వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు బిస్వే ప్రేమ్నాద్, మౌస్మితి, మీనా, అరవింద్ భగత్, ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో రాజలింగం, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి: డీఈవో



మిరుదొడ్డిలో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 7: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పదోతరగతి పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాలను సాధించేవిధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మిరుదొడ్డి మోడల్‌స్కూల్‌లో నియోజకవర్గస్థాయి ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణతను సాధించడానికి ప్రణాళికలను తయారుచేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై చర్యలను తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం మండలంలోని ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈవోలు ప్రభుదాస్, నర్సమ్మ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులున్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం

● దుద్దెడలో అట్టహాసంగా ముగిసిన శంభుదేవుడి వార్షిక బ్రహ్మోత్సవాలు ● హాజరైన ప్రముఖులు





శాస్త్రోక్తంగా శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు, స్వామివారి ఊరేగింపులో కోలాటాలు

కొండపాక, ఫిబ్రవరి 7: మండలంలోని దుద్దెడ గ్రామంలోని స్వయంభు శంభుదేవుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శివపార్వతుల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. మూడు రోజులపాటు కొనసాగిన ఈ ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు నిర్వహించిన కల్యాణోత్సవానికి పరిసరగ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో వేసిన ముత్యాల పందిరిలోకి స్వామివారిని స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం నుంచి భక్తుల కోలాటాలు, బాజా భజంత్రీలు, మంగళవాయిద్యాలతో తీసుకువచ్చారు. ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్రం మార్మోగుతుండగా, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య వేదపండితులు శివపార్వతుల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సికింద్రాబాద్‌కు చెందిన భక్తులు పద్మ రాజేశ్వర్, రమా శ్రీనివాస్ బండి కీర్తి మాధవరెడ్డి, కూర శ్రీనివాస్ దంపతులు కల్యాణోత్సవ పెద్దలుగా పీటలపై కూర్చున్నారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితర కార్యక్రమం నిర్వహించారు. రథోత్సవంలో శివపార్వతుల విగ్రహాలను ఘనంగా ఊరేగించారు.

దర్శించుకున్న ప్రముఖులు

స్వయంభూ శంభు దేవుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన శివపార్వతుల కల్యాణానికి పలువురు ప్రముఖులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వేలేటి రోజా రాధా కిషన్‌శర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ ఎంపీడీవో రాంరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ప్రియదర్శిని పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఆరెపల్లి మహదేవ్ గౌడ్, ఎంపీటీసీ గురజాడ బాలాజీ, దేశాయి రెడ్డి ,గోనె శ్రీనివాస్, మంచాల శ్రీనివాస్, పెద్ది కుమారస్వామి, మంచాల చిన్న శ్రీనివాస్, పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, వి. శ్రీనివాస్,అమిరిశెట్టి వెంకటేశం,పెద్ది నర్సయ్య వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పుల్లూరు బండ జాతరను ఘనంగా నిర్వహించాలి



హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేసిన నాయకులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 7: సిద్దిపేట మండలంలో జరిగే పుల్లూరు బండ జాతరకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. బుధవారం ఆలయ వంశ పారంపర్య అర్చకుడు గ్రామ నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసంలో పుల్లూరుబండ జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 9 నుంచి 11 వరకు జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వారు హరీశ్‌రావుకు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయాన్ని ఇప్పటికే సుమారు రూ. 3.50 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని తెలిపారు. బండ పైకి వాహనాలు వెళ్లడం కోసం టీటీడీ నిధులతో రూ. 35 లక్షలలతో సీసీ రోడ్డు నిర్మింప జేశామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్య, పొడిచేటి రామకృష్ణ, గ్రామ తాజా మాజీ సర్పంచ్ పల్లె నరేష్‌గౌడ్, గ్రామ ఎంపీటీసీ సభ్యులు కుంచం లతవెంకట్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి. బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు కనకం మల్లేశం, గరిపల్లి వినయ్, పురోహితుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దౌల్తాబాద్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్



యాదగిరి

రాయపోల్, ఫిబ్రవరి 7: విధి నిర్వహణలో నిర్లక్ష్యంతో పాటు బాధ్యతారహితంగా వ్యవహరించినందున సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ దౌల్తాబాద్ పంచాయతీ కార్యదర్శి మెరుగు యాదగిరిని సస్పెండ్ చేశారు. దౌల్తాబాద్‌కు చెందిన పలువురికి పంచాయతీ కార్యదర్శి యాదగిరి ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు ఇచ్చారు. గ్రామ పంచాయతీకి ఇళ్ల ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు ఇచ్చే అధికారం లేదని, అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్లు ఇవ్వడంతో కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఈ విషయమై దౌల్తాబాద్ ఎంపీడీవో రాజేష్‌కుమార్‌ను వివరణ కోరగా దౌల్తాబాద్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్ విషయం వాస్తవమేనని తెలిపారు. సూరంపల్లికి చెందిన పంచాయతీ కార్యదర్శి సతీష్‌ను దౌల్తాబాద్‌కు ఇన్‌చార్జిగా నియమించినట్లు పేర్కొన్నారు.

మల్లన్న ఆలయ ఏఈవోగా శ్రీనివాస్



సంతకం చేస్తున్న శ్రీనివాస్

చేర్యాల, ఫిబ్రవరి 7 : కొమురవెల్లి మల్లన్న ఆలయ ఏఈవోగా బుద్ధి శ్రీనివాస్ బుధవారం విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులలో సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న వైరాగ్యం అంజయ్యను ఇటీవల కొండగట్టుకు బదిలీ చేసిన విషయం విదితమే.

పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో 'కనువిప్పు'

మద్దూరు, ఫిబ్రవరి 7: మండలంలోని లద్నూరు గ్రామంలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కనువిప్పు కార్యక్రమం ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ మాట్లాడారు. మూఢనమ్మకాలు, దుర్వ్యసనాలతో నష్టాలు, వరకట్నం, వృద్ధ తల్లిదండ్రుల పోషణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పెండింగ్ చాలాన్‌లపై రాయితీ ప్రకటించినందున వాహనాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు బాలు, రాజు, రవీందర్, తిరుమల పాల్గొన్నారు.



సీపీ అనురాధకు పూల మొక్కను అందజేస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా సత్యనారాయణ రెడ్డి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 7 : సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా పి.సత్యనారాయణరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సీపీ డాక్టర్ బి. అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

కుకునూరుపల్లి మాజీ సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్‌ను సత్కరిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

కొండపాక, ఫిబ్రవరి 7: గ్రామంతో పాటు పాఠశాలల అభివృద్ధికి కృషి చేసిన కుకునూరుపల్లి సర్పంచ్ పొల్కంపల్లి జయంతి నరేందర్‌లను ఎంఈవో శ్రీనివాసరెడ్డి బుధవారం ఘనంగా సత్కరించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సర్పంచ్ ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా ఎంఈవో పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం చేశారు.

నులి పురుగులపై అవగాహన

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 7: నులి పురుగుల నివారణకు ప్రతి ఒకరూ కృషి చేయాలని ఎంపీపీ బాలేషంగౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల కార్యాలయంలో వైద్యశాఖ అధికారులు, ఎంపీడీవో పట్టాభి రామారావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న నులి పురుగుల నివారణదినోత్సవం సందర్భంగా వైద్యశాఖ అధికారులు అన్ని గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరారు.

జడ్పీ చైర్‌పర్సన్, సీపీలకు విద్యాధరి ఆలయకమిటీ ఆహ్వానం



జడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

వర్గల్, ఫిబ్రవరి 7 : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో ఈ నెల 14న వసంత పంచమి వేడుకలకు రావాలని కోరుతూ వర్గల్ విద్యాధరి క్షేత్రం ఆలయ కమిటీ సభ్యులు బుధవారం పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. ఈ మేరకు సిద్దిపేట పట్టణంలోని జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ, సీపీ అనురాధలకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

దాసారంగుట్టను కాపాడాలి

చేర్యాల, ఫిబ్రవరి 7: కొమురవెల్లి గ్రామరెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 305లోని దాసారంగుట్ట సమీప భూమిని రియల్టర్ల నుంచి రక్షించాలని కోరుతూ సీపీఎం నాయకులు బుధవారం కొమురవెల్లి తహసీల్ కార్యాలయాధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు దాసరి ప్రశాంత్, ఇస్తారి, బాలకిషన్, నరేశ్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న కార్మికులు

గజ్వేల్, ఫిబ్రవరి 7: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ప్రతి నెలా విడుదలయ్యే నిధుల నుంచి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఎంప్లాంయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు పాల్గొంటారని తెలియజేస్తూ కమిషనర్ విద్యాధర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికి భద్రతా, సంక్షేమ, సౌకర్యాలు కల్పించాలంటూ పలు డిమాండ్లు చేశారు. వారితో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సంగాపూరం యాదగిరి, ప్రధాన కార్యదర్శి బచ్చలి కుమార్, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● కొండపాక: అఖిలభారత కార్మికుల సమ్మె గ్రామీణ బందులో భాగంగా సమ్మెలో పాల్గొంటామని మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో శ్రీనివాసరెడ్డికి బుధవారం సమ్మె నోటీసు ఇచ్చారు ఈ నెల 16న జరిగే సమ్మెలో పాల్గొంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉమ్మడి మండల అధ్యక్షుడు అమ్ముల బాల నర్సయ్య, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కృష్ణ, ఉప్పలయ్య పుష్ప, అరుణ, కలవ్వ అనిత, హంసవ్వ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

మద్దూరు, ఫిబ్రవరి 7: గ్రామాల్లో స్పెషలాఫీసర్లు ప్రత్యేక పారిశుధ్య పనుల స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. మురికి కాల్వలను శుభ్రపర్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ఈ నెల 7, 8న వీధులు, రోడ్లు, మురికి కాల్వల శుభ్రత, పిచ్చి మొక్కల తొలగింపు, శిథిలమైన ఇళ్లతో పాటు పాడుబడిన బావుల పూడ్చివేత, వాడుకలో లేని బోర్‌వెల్స్‌ను పూడ్చివేత, 9న మురికి నీటి నిల్వల పూడ్చివేత, డ్రైడే పాటించుటతో పాటు మరుగుదొడ్ల వినియోగం, 10న ప్రభుత్వ కార్యాలయాల శుభ్రత, 11న తాగునీటి సరఫరాలో లీకేజీలు అరికట్టడం, మంచినీటి ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్, మిషన్ భగీరథ నీటి సరఫరాలోని ఇబ్బందులు, నల్లా కనక్షన్ల సర్వే, 12న నల్లా కనెక్షన్లు లేని వారి గుర్తింపు, కనెక్షన్ ఇచ్చుట, 13న వృథానీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించుట, 14న గ్రామస్థులకు అవగాహన, 15న సామాజిక దూరాచారాలను నిర్మూలించుటకు గ్రామ సభల ఏర్పాటు, అవగాహన, ప్రతిభ చూపినవారికి సన్మాన కార్యక్రమాలుంటాయని తెలిపారు.



దూళిమిట్ట మండలం తోర్నాలలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీవో

●హుస్నాబాద్ రూరల్: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పందిల్ల గ్రామంలో గ్రామాభివృద్ధి సంబంధించి మంజూరైన పనులకు గ్రామసభలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నర్సరీలను, పల్లెప్రకృతి వనం, డంపింగ్‌షెడ్‌లను పరిశీలించారు. ఇందులో ఎంపీటీసీ జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌ఐ

చేర్యాల, ఫిబ్రవరి 7 : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి అప్రమత్తంగా వ్యవహరించాలని కొమురవెల్లి ఎస్‌ఐ నాగరాజు అన్నారు. జాగ్‌రూక్తా దివాస్ సందర్భంగా బుధవారం కొమురవెల్లి మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930, 100నంబర్లకు కాల్‌చేయాలని సూచించారు. కార్యక్రమంలో కస్తూర్బా ప్రత్యేకాధికారి నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.అలాగే చేర్యాల ఎస్‌ఐ దామోదర్ చేర్యాల మండలం గుర్జకుంట జడ్పీఎస్ఎస్ విద్యార్థులకు షీటీమ్స్‌తో పాటు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

● జగదేవ్‌పూర్: సైబర్ నేరాలపై ప్రతి ఒకరుఅవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ చంద్రమోహన్ అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న తెలంగాణ మాలమహానాడు నాయకులు

చేర్యాల/కొండపాక, ఫిబ్రవరి 7: రమాబాయి అంబేడ్కర్ 126వ జయంతిని బుధవారం చేర్యాల లో తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహావరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ తదితరులు రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కమలాపురం కిష్టయ్య, పుట్ట రాజు, పుట్ట యాదయ్య, బుట్టి బాలయ్య, బాస్కర్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కొండపాక బాలుర గురుకుల పాఠశాలలో గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి మాత రమాబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు కార్యక్రమంలో త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ రాజారాం, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహాచారి, వైస్ ప్రిన్సిపాల్ సప్న జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బక్కురి నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాముల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలోనే సంతృప్తి



పాఠశాలలకు పుస్తకాలు, సామగ్రి అందిస్తున్న రాజు

గజ్వేల్, ఫిబ్రవరి 7: సమాజ సేవలోనే సంతృప్తి దక్కుతుందని టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఆప్కో మాజీ డైరెక్టర్ తలకొక్కుల రాజు పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో టీవై రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు లైబ్రరీల స్థాపనకు పుస్తకాలు, బీరువాలను పంపిణీ చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలోని అహ్మదీపూర్, చేబర్తి, మజీద్‌పల్లి, బూరుగుపల్లి గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సామగ్రిని బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి లైబ్రరీలు స్థాపించడానికి కృషి చేస్తున్నామన్నారు. లైబ్రరీలు స్థాపించాలని భావించేవారు వెంటనే టీవైఆర్ ఫౌండేషన్‌ను సంప్రదించాలని కోరారు. వారితో టీవైఆర్ ట్రస్ట్ వైస్ చైర్మన్ విజయలక్ష్మి, కోఆర్డినేటర్ అజయ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దిపేటకు ఏ హోదాలో వచ్చావ్?

● మైనంపల్లిపై ధ్వజమెత్తిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 7: మైనంపల్లి అంటే బ్రాండ్ అని తనకు తానే గొప్పలు చెప్పుకుంటున్న హనుమంతరావు, వాస్తవానికి ఒక పెద్ద గుండా అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, మెరుగు మహేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏ పదవులు లేని మైనంపల్లి మంగళవారం ఏ హోదాలో సిద్దిపేటలో పర్యటించారని ప్రశ్నించారు. ప్రభుత్వం తరఫున వస్తే సిద్దిపేటలో అభివృద్ధికి నిధులు కేటాయిస్తారేమో అనుకున్నామని అవేమీ ప్రకటించకుండానే, హరీశ్‌రావుపై, కేసీఆర్, కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. మరోసారి హరీశ్‌రావుపై వ్యక్తిగతంగా విమర్శలు చేస్తే సహించే లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై దాడులు జరిగితే హరీశ్‌రావుపై దాడి చేస్తానని నోటికి వచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. హనుమంతరావు బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడరని తెలిపారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఫుట్‌బాల్ కోచ్ అక్బర్ నవాబ్‌పై దాడి చేయడం పిరికిపంద చర్యగా భావిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్ వజీర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మోయిజ్, అక్బర్ నవాబ్, రెబల్ రమేష్, రజనీకాంత్‌రెడ్డి, పెర్క మధు, శ్యామ్ యాదవ్, మహేష్, రాజు, స్వామి, సాయిచరణ్ గౌడ్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

గుండాగిరి చేయడానికి వచ్చారా?

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 7: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ కనకమల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ నేత మైనంపల్లి సిద్దిపేటకు గుండా గిరి చేయడానికి వచ్చారా అని ప్రశ్నించారు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే సంక్షేమ పథకాలను అమలుచేసి మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు కృష్ణా గౌడ్, మల్లేశం పాల్గొన్నారు.



సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రాయకీయాల్లో విద్వేషాన్ని ప్రజలు సహించరు

గజ్వేల్, ఫిబ్రవరి 7: డబ్బు అహంకారంతో గుండాయిజాన్ని అడ్డుపెట్టుకుని సిద్దిపేట మీదకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దండయాత్రకు వచ్చారని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ విమర్శించారు. గజ్వేల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాల్లో విద్వేషాన్ని నింపుకుని దండయాత్రలు చేస్తే ప్రజలు సహించరన్నారు. మైనంపల్లి హనుమంతరావు దురుసుతనాన్ని గమనించిన మల్కాజ్‌గిరి ప్రజలు ఇటీవల ఎన్నికల్లో గుణపాఠం చెప్పారన్నారు. మరోసారి హరీశ్‌రావుపై అవాకులు, చవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి యువతి మృతి

కొండపాక, ఫిబ్రవరి 7: ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కింద పడి యువతి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం మండలంలోని దుద్దెడలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. చేర్యాల మండలం గూడెం గ్రామానికి చెందిన లత(22) దుద్దెడలోని తన సోదరి ఇంటికి వచ్చింది. బావ కాట కార్తీక్ నిర్మిస్తున్న నిర్మాణ పనుల్లో ఆమె సహాయం చేస్తుండగా కాలు జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య



నర్సింహులుగౌడ్(ఫైల్)

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 7: మండలంలోని బూర్గుపల్లిలో మనోవేదన భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గుపల్లి గ్రామానికి చెందిన జనగామ నర్సింహులుగౌడ్(35) కులవృత్తితో పాటు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడాది క్రితం భార్య లత అనారోగ్యంతో మరణించింది. కొడుకు బంధువుల వద్ద ఉంటూ ఇంటర్ చదువుకుంటున్నాడు. కాగా భార్య మృతి చెందినప్పటి నుంచి నర్సింహులుగౌడ్ తన తండ్రితో కలిసి ఉంటున్నాడు. స్నేహితులతో కలిసి భార్య మృతి గురించి చెప్పుకుంటూ తీవ్ర వేదనకు గురయ్యేవాడు. బుధవారం ఉదయం తండ్రి బయటకు వెళ్లి ఇంటికి వచ్చే సరికి నర్సింహులుగౌడ్ ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహాయంతో మృత దేహాన్ని కిందికి దించి పోలీసులకు సమాచారమందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి



కృష్ణాగౌడ్(ఫైల్)

రాయపోల్, ఫిబ్రవరి 7: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బేగంపేట గ్రామంలో చోటు చేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, బేగంపేట ఎస్‌ఐ అరుణ్ వివరాల ప్రకారం.. బేగంపేట గ్రామానికి చెందిన బయ్యారం కృష్ణాగౌడ్ ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.6 లక్షలకు పైగా అప్పు చేశాడు. అప్పులు తీర్చలేక తీవ్రమానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన కృష్ణాగౌడ్ భార్యకు ఫోన్ చేసి అప్పులు తీర్చడం ఇబ్బందిగా మారడంతో గడ్డి మందు తాగినట్లు చెప్పాడు. చికిత్స నిమిత్తం గజ్వేల్ తీసుకెళ్లి, పరిస్థితి విషమంగా మారడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య వర్ష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ డిపాజిట్ విషయంలో భక్తులతో గొడవ

చేర్యాల, ఫిబ్రవరి 7: కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆవరణలో సెల్‌ఫోన్ భద్రపరిచే టెండర్‌దారుడికి భక్తులకు మధ్య బుధవారం గొడవ జరిగింది. హన్మకొండ జిల్లాకు చెందిన పలువురు భక్తులు దర్శనం కోసం క్యూలైన్ గుండా వెళ్తుండగా సెల్‌ఫోన్ భద్రపరిచే కౌంటర్ నిర్వాహకులు అడ్డుకున్నారు. కౌంటర్‌లో సెల్‌ఫోన్ డిపాజిట్ చేసిన తర్వాతే దర్శనానికి వెళ్లాలని గొడవకు దిగారు. ఇరువర్గాలు మాటలు పెరిగి తోపులాడుకోవడంతో ఒకరికి స్వల్పగాయమైంది. సదరు భక్తుడితో పాటు కౌంటర్ సంబంధీకులు కొమురవెల్లి పోలీసులను ఆశ్రయించారు.అనంతరం ఇరువర్గాలు రాజీ కుదుర్చుకున్నాయి.

డ్రంకెన్ డ్రైవ్‌లో 26మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 7: సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినవారిని కోర్టులో హాజరు పర్చగా జరిమానా విధించినట్టు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. ట్రాఫిక్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వాహన తనిఖీల సందర్భంగా 26 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని తెలిపారు. వారిని బుధవారం సిద్దిపేట అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. శ్రావణి ఎదుట హాజరుపర్చగా విచారణ చేసి 26 మందికి రూ.34,900 జరిమానా విధించినట్లు చెప్పారు.

నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు: ఎంపీడీవో

అక్కన్నపేట, ఫిబ్రవరి 7: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీవో కొప్పుల సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దుబ్బతండా, చాపగానితండా, కట్కూర్ గ్రామాల్లో నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ, పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోకుండా నీటిని అందిస్తూ కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు. ఎండిపోయిన మొక్కల చోట కొత్త మొక్కలను నాటించాలన్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి గుగులోతు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

దుబ్బాక, ఫిబ్రవరి 7: సీఎం రేవంత్‌రెడ్డిపై చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక మున్సిపాలిటీ యువజన అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం దుబ్బాక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేశం, స్వామి, రాజు, దత్తంస్వామి, బాలవెంకన్న, రమేష్ పాల్గొన్నారు.

● గజ్వేల్ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండలంలోని కొల్గూరు గ్రామంలో బుధవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, శ్రీకాంత్,ఆనందు,నర్సింలు, సంతోష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి

తొగుట, ఫిబ్రవరి 7: పార్టీల కతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తొగుట ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి, లింగాపూర్, ఎల్. బంజర్‌పల్లి, వెంకట్రావ్‌పేట, చందాపూర్, తొగుట, కాన్గల్, తుక్కాపూర్, ఎల్లారెడ్డిపేట, పెద్దమాసాన్‌పల్లి, మెట్టు, ఘనపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడానికి ఈ నెల 8న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ ఎంపీపీ గంట రేణుక రవిందర్, మాజీ వైస్ ఎంపీపీ కూచి మహిపాల్‌రెడ్డి, నాయకులు భూస నిరంజన్‌రెడ్డి, ఎన్నం భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతానియమాలను పాటించాలి

చేర్యాల, ఫిబ్రవరి 7 : సురక్షిత ప్రయాణం కోసం ప్రతీ ఒక్కరూ రోడ్డుభద్రతా నియమాలను పాటించాలని చేర్యాల ఎంవీఐ కవిత, సబ్ ఇన్‌స్పెక్టర్ దామోదర్ పేర్కొన్నారు. రోడ్డుభద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్థానిక ఎంవీఐ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మద్యంసేవించి వాహనాలు నడపకూడదని, విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేదా జరిమానాలు, చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీల ఎన్నిక

చేర్యాల, ఫిబ్రవరి 7 : కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండల గ్రామకమిటీలను బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల వివరాలను వెల్లడించారు. కొముర వెల్లి అధ్యక్షుడుగా లింగంపల్లి కనకరాజు, ఉపాధ్యక్షుడిగా దొడ్ల విష్ణుమూర్తి, కిష్టంపేటలో పొన్నం చంద్రయ్య, ఆకుల యాదయ్య, మర్రిముస్త్యాలలో తురాయి నవీన్, చెంచు కిష్టయ్య, లెనిన్ నగర్‌లో సానాది నాగ రాజు, దాసరి నర్సింహులు, గౌరాయపల్లిలో దండ్యాల వెంకటనర్సింహారెడ్డి, చెంచల యాదయ్య, రసూలాబాద్‌లో జంగం శ్రీకాంత్, చింతల పరశురాములు, ఐనాపూర్‌లో మల్లం బాలయ్య, కుక్కల సత్తయ్య, తపాస్‌పల్లిలో కంకణాల ప్రవీణ్, ములుగు యాదగిరి, పోసాన్‌పల్లిలో వంగలి నర్సింహులు, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, గురువన్నపేటలో బీ. చంద్రం, జె. ధనుంజయ్, రాంసాగర్‌లో ఏసిరెడ్డి మల్లారెడ్డి, తిప్పారం కనకయ్య అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైనట్టు తెలిపారు.